రైల్వే లైన్లు పూర్తి చేయాలి : యువజన కాంగ్రెస్

ప్రజాశక్తి - రాయచోటి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పునరాలోచించి కడప-రాయచోటి-బెంగుళూరు రైల్వే ప్రాజెక్టు పనులు పునఃప్రారంభించి రైల్వేలైన్లు పూర్తిచేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సోమలరాజు జనార్ధనరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప-పెండ్లిమర్రి-ఇడుపులపాయ-రాయచోటి-వాయల్పాడు-మదనపల్లి-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం పూర్తి చేయడానికి బాధ్యత తీసుకోవాలన్నారు. కడప-బెంగుళూరు రైల్వేలైన్ నిర్మాణానికి నూరు శాతం కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలని పార్లమెంట్ సమావేశాల్లో కడప, రాజంపేట పార్లమెంట్ సభ్యులు కోరాలన్నారు. కడప, కమలాపురం, రాయచోటి, పీలేరు, మదనపల్లె ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు మంజూరు చేయించాలని పేర్కొన్నారు. సమిష్టి పోరాటాలకు రాజకీయ పార్టీలు, ప్రజా, విద్యార్థి, అన్ని రకాల ప్రజా సమూహాలు, కుల సంఘాలు ముందుకు కావాలన్నారు.

యువత లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలి

- మెగా జాబ్‌మేళాలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధన దిశగా ముందుకు వెళితే అనుకున్నది సాధించవచ్చునని లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాకు ఎంపీ మిదున్‌రెడ్డి, కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ బాషా, క్విస్ కంపెనీ రీజినల్ మేనేజర్ హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. నిరుద్యోగ యువత చిన్న ఉద్యోగమైనా నిరాశ చెందకుండా ఉద్యోగంలో చేరి అంచలంచెలుగా ముందుకు ఎదగాలన్నారు. రాయచోటి పట్టణంలో జాబ్ మేళా నిర్వహించేందుకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కృషి మరువలేనిదని ఇక్కడికి వచ్చిన నిరుద్యోగులకు రవాణా, ఉచిత భోజన వసతులు ఎమ్మెల్యే ఏర్పాటు చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత జాబ్ మేళా సద్విని చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. కలెక్టర్ గిరీష మాట్లాడుతూ ఉద్యోగాలు ఇవ్వడంలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉందన్నారు. జిల్లాలోని ప్రతి డివిజన్‌లో జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఒక వ్యక్తి ఉద్యోగం పొందాలంటే ఎక్కడికో వెళ్లి అక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కోవాలని, జాబ్ మేళాలలో అటువంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగం పొందవచ్చని తెలిపారు. జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఎంపీ, ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

చొరవతో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం తక్కువ జీతమని నిరుత్సాహం చెందకుండా ప్రతి ఒక్కరూ ఉద్యోగంలో చేరాలన్నారు. తర్వాత స్కిల్స్‌ని బట్టి జీతం పెరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ విశేష కృషి చేస్తుందన్నారు. యువత తమ కాళ్లపై నిలబడేందుకు ఉద్యోగంలో చేరి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. జడ్‌పి చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత సంక్షేమం కోసం ప్రభుత్వం జాబ్‌మేళా కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారిలో చైతన్యం నింపుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో నిరుపేదలందరికీ మెరుగైన విద్య అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు.

జిల్లా కౌన్సిల్ సమావేశం జయప్రదం చేయండి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ

ప్రజాశక్తి - రాయచోటి

ఆదివారం నిర్వహించబోయే యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ పిలుపునిచ్చారు. శనివారం రాయచోటిలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ ఏర్పడిన నాటి నుంచి అన్ని రకాల కేడర్ల ఉపాధ్యాయులను ఐక్యం చేసి ఉపాధ్యాయుల పక్షపాతిగా నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ ట్రిపుల్ బెనిఫిట్ స్కీం, రీ గ్రూపింగ్ స్కేల్, బదిలీల కౌన్సిలింగ్ విధానం, అప్రెంటిస్ విధానం రద్దు వంటి విజయాలు సాధించడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. కానీ నేటి పాలకుల అనాలోచిత విధానాల కారణంగా ఉపాధ్యాయులు తమ హక్కులు, ఆర్థిక ప్రయోజనాలు ఒక్కొక్కటిగా కోల్పోతున్నారు. ఈ విధానాలను నిరసిస్తూ యుటిఎఫ్ ఎప్పటికప్పుడూ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. జాతీయ విద్యా విధానం అమలు పేరుతో తీసుకువచ్చిన సంస్కరణల కారణంగా ప్రభుత్వ విద్యా రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన డిఎలు చెల్లించకపోవడం, మెరుగైన పిఆర్‌సి అమలు చేయకపోవడం, ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ వంటి సొమ్మును సకాలంలో మంజూరు చేయకపోవడం, సరెండర్ లీవ్‌కు నగదు చెల్లింపులు లేకపోవడం, బోధనా సమయాన్ని బోధనేతర కార్యక్రమాలైన యాప్‌ల వినియోగంతో హరించి వేయడం, పాఠశాలల పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను వేధించడం నిత్యకృత్యంగా మారింది అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యా

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ

రంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్చించి, భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించేందుకు యుటిఎఫ్ అన్నమయ్య జిల్లా కౌన్సిల్ సమావేశం రాజంపేటలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల ఉపాధ్యాయులు జిల్లా కౌన్సిల్ సమావేశంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆహ్వానం పలుకుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, షేక్ జాబిర్, జిల్లా సహాధ్యక్షులు శివారెడ్డి,హేమలత, జిల్లా కోశాధికారి చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శులు సుధాకర్ నాయుడు, రమణయ్య, గంగా దేవి, అక్రమ్ బాషా, వెంకట రమణ, రాయచోటి మండల నాయకులు రాజా రమేష్, ప్రసాద్, వీరబల్లి మండల నాయకులు తిరుపతి, అమీనుల్లా, నాగార్జున పాల్గొన్నారు.

ముస్లిముల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం :'చమర్తి'

జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముస్లిం మైనార్టీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. శనివారం పట్టణ శివారులోని ఓ కల్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయులు ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ఇస్లామిక్ బ్యాంక్ ప్రారంభిస్తానని, గద్దెనెక్కి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా, కనీసం కార్పొరేషన్‌కు నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఉర్దూ పాఠశాలను మూసివేసి, నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఉర్దూ ఉపాధ్యాయుడిని కూడా నియమించకపోవడం దారుణమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉర్దూ డిఎస్‌సి నిర్వహించి 1100 పోస్టులను భర్తీ చేసిందని గుర్తు చేశారు. బైజూస్ ట్యాబ్స్‌లో ఉర్దూ పాఠాలు లేకపోవడం అనేది ముస్లిం విద్యార్థుల పట్ల ప్రభుత్వం చూపుతున్న వివక్షత కాదా అని ప్రశ్నించారు. రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రంజాన్ తోఫా అందించిందని దానిని కూడా వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో మైనార్టీల సంక్షేమం కోసం భవనాలు నిర్మిస్తే నేడు వైసిపి ప్రభుత్వంలో దాడులు చేసి భూములు కబ్జా చేస్తుందని ఎద్దేవా చేశారు. టిడిపి హయాంలో ముస్లిం మైనారిటీలకు పెద్దపీట వేశారని, ఇమామ్‌లకు రూ.5 వేలు, మొజాంలకు రూ.3 వేలు గౌరవ వేతనం కూడా ఇచ్చిందన్నారు. అనంతరం మైనార్టీ నేతలు జగన్మోహన్‌రాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ముస్తాక్ అహ్మద్, పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి సీనియర్ నాయకులు, జనసేన పార్లమెంట్ ఇన్‌ఛార్జి ముకరం చాన్, కార్యకర్తలు, ముస్లిం సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.

ఇవిఎం ప్రదర్శన కేంద్రం ప్రారంభం

ఇవిఎం పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి- రాయచోటి

ఇవిఎంల ద్వారా ఓటు వేసే విధానాన్ని ఓటర్లకు వివరించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇవిఎం ప్రదర్శన కేంద్రాన్ని శనివారం కలెక్టర్ గిరీష పిఎస్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ ఇవిఎం ప్రదర్శన కేంద్రంలో ఉన్న కొంతమంది ప్రజలకు ఓటు వేసే విధానాన్ని ఓటు వేయించి వివరించారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటరు, పోలింగ్ యూనిట్ మీద ఉన్న పేర్లలో తాను ఎన్నుకోవాలనుకున్న వ్యక్తి పేరుకు ఎదురుగా ఉన్న నీలిరంగు బటన్‌ను నొక్కినప్పుడు ఓటు వేసినందుకు గుర్తుగా ఎరుపు రంగు బల్బు వెలుగుతుందని, అనంతరం ఓటరు ఎంచుకున్న అభ్యర్థి సీరియల్ నెంబరు, పేరు, గుర్తు, తదితర వివరాలతో కూడిన బ్యాలెట్ కాగితం వివి ప్యాట్ మిషన్‌లో ఏడు సెకండ్ల పాటు చూపిస్తుందని వివరించారు. ఓటు వేసినందుకు గుర్తుగా శబ్దం వినపడకపోయినా లేదా ఎరుపు రంగు బలుపు వెలగకపోయినా, ముద్రించబడిన కాగితం చూపించక పోయినా, సంబంధిత పోలింగ్ అధికారికి ఓటర్లు తెలపాలని సూచించారు. ఇవిఎం ప్రదర్శన కేంద్రంలోకి వచ్చిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇవిఎం ద్వారా ఓటు వేసే విధానాన్ని వివరించాలని ప్రదర్శన కేంద్రంలోని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎఒ బాలకృష్ణ, ఎలక్షన్ సెల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-వీరబల్లి

డ్వామా అడిషనల్ పీడీ ఎం.సి.మద్దిలేటి అధ్యక్షతన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మల్లీశ్వరి ఆధ్వర్యంలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ మాట్లాడుతూ పనుల్లో జరిగిన అక్రమాలపై సంబంధిత ఉపాధి సిబ్బంది నుంచి సుమారు రూ.48,974 రికవరీ చేయాలని ఆదేశించారు. పొలాల్లో భూమి లెవలింగ్, పంట కల్లాల నిర్మాణం, చెరువులు, కుంటల్లో ఒండ్రుమట్టి తొలగింపు, కంపోస్టు షెడ్‌ల నిర్మాణం, పాటు కాలువల మరమ్మతులు, నర్సరీల్లో మొక్కల పెంపకం, మొక్కలు నాటడం, గ్రామాల్లో సిసి రోడ్లనిర్మాణం వంటి అనేక పనులపై చర్చించారు. ఈ పనులకు సంబంధించిన ఎంబి రికార్డులను తీసుకుని సామాజిక తనిఖీ సిబ్బంది పని ప్రదేశానికి వెళ్లి వాస్తవంగా పని జరిగిందా, కొలతల ప్రకారం ఎంబిలో రికార్డు చేశారా మస్టర్‌లో నమోదు చేసిన కూలీలకు చెల్లింపులు నిబంధనల ప్రకారం చేశారా వంటి అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి, రాజేందర్ నాథ్‌రెడ్డి, ఎపిడిలు ప్రతాప్, రెడ్డయ్య నాయుడు, అంబుడ్స్ మెన్ శివప్రసాద్, ఎపిఒ నాగరాజ్, ఎస్ఆర్ మోహన్, హౌసింగ్ ఎఇ వెంకటేష్, పిఆర్ ఎఇ నాగూర్‌బాషా, ఆర్డబ్ల్యుఎస్ఎఇ ప్రసాద్, ఇఒపిఆర్‌డి రామ చంద్రారెడ్డి, ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఇండోనేషియాతో వైవీయూ ఒప్పందం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన యూనివర్సిటీ, ఇండోనేషియా దేశం ఉదయాన యూనివర్సిటీ మధ్య అంతర్జాతీయ ఒప్పందం (మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్) కుదుర్చుకున్నారు. విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్టర్ ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య మార్గదర్శకం మేరకు జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎ.ముని కుమారి ఇండోనేషియాలోని ఉదయాన యూనివర్సిటీ కి వెళ్లి అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశోధన పత్రాన్ని సమర్పించడంతోపాటు ఈ ఒప్పంద ప్రకియను పూర్తి చేశారు. పత్రాలను శనివారం విశ్వవిద్యాలయ విసి, రిజిస్ట్రార్ అందజేశారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ప్రాంగణ ఎంపికల్లో 15 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్‌లో బి.టెక్ 4వ సంవత్సరం విద్యార్థులకు ట్యాప్ అకాడమీ బెంగళూరు వారు డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 15 మంది ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఈ డ్రైవ్‌లో ట్యాప్ అకాడమీ హెచ్ఆర్ సుఫియా ఖాన్ పాల్గొని డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.4 లక్షల ప్యాకేజీ ఇస్తారని పేర్కొన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి వీరిని అభినందిస్తూ భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో టిపిఒ మనోజ్ కుమార్, ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్ పి.లోకేష్ మునికుమార్, ఇతర విభాగాధిపతులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

'మిట్స్'లో విద్యార్థులకు టెక్నాలజీ అన్వేషణ పోటీలు

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నాలజీ అన్వేషణ పోటీలను విద్యార్థులకు నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ అన్నారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రస్తుతం ఉన్న టెక్నాలజీలలో ఉన్న ఆలోచనలు, వారు అభివృద్ధి చేసిన నూతన ఆవిష్కరణలను ఈ పోటీలలో ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అగస్త్య ఫౌండేషన్ వారి సహకారంతో కళాశాలలో నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వి.భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఇన్నోవేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవడానికి వారి టెక్నాలజీపై నూతన ఆలోచనలు మెరుగుగా ఉండాలని పేర్కొన్నారు. స్టార్టప్ కంపెనీలు స్థాపించడానికి ఇలాంటి నూతన ఆవిష్కరణలు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు వారి ఐడియాలతో నూతన ప్రాజెక్ట్స్ చేయడానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. 74 బృందాలు 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ కుసుమ, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) కో-ఆర్డినేటర్ డాక్టర్ అరుళ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ కేంద్రంలో ఆర్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కొత్త బోయినపల్లిలో నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. బూత్ స్థాయి అధికారులు, వివిధ పార్టీల నాయకులకు ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఈ శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు కార్డులో ఉన్న తప్పులను సవరించుకోవాలని సూచించారు.

సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి

పనులు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

క్రికెట్ స్టేడియం పనులు పరిశీలన

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో శరవేగంగా రూపుదిద్దుకుంటున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను శనివారం ఎంపీ మిథున్‌రెడ్డి, కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి మండలం దిగువ అబ్బవరం గ్రామపంచాయతీ నక్కలవాండ్లపల్లి వద్ద నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి వెంటనే పూర్తి చేయాలన్నారు. స్టేడియానికి వచ్చే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం వెళ్లి విరిసెలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పనుల పురోగతిపై రెవెన్యూ, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్యాలరీ ఏర్పాటుపై చర్చించి వాకింగ్ ట్రాక్, పిచ్ నిర్మాణంపై తగు సూచనలు జారీ చేశారు. గ్రౌండ్ మొత్తం పచ్చదనంతో గడ్డిని నింపాలన్నారు. సందర్భంగా క్రికెట్ స్టేడియం మొత్తం కలియ తిరిగి పరిశీలించారు.

గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి

- హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య

ప్రజాశక్తి-పీలేరు

గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. శనివారం తలుపుల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు మండలం, ఒంటిల్లులో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో- అమ్మ క్షేమం' అంశంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు గర్భం దాల్చాక మొదటి మూడు మాసాల తర్వాత రక్త మోతాదును బట్టి రోజుకు ఒకటి లేక రెండు ఐరన్ మాత్రలతో పాటు, మామూలుకన్నా పావు భాగం పోషకాలతో కూడిన మేలైన పౌష్టికాహారం తీసుకోవాలని, పగటిపూట అదనంగా రెండు గంటల పాటు విశ్రాంతి, రాత్రిపూట 8 గంటలు నిద్ర, వ్యక్తిగత శుభ్రత వంటి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఆసుపత్రి కాన్పు ప్రయోజనాలు గుర్తించాలని కొండయ్య గర్భిణులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఎన్ఎం వసుందర, సిహెచ్ఒ నాగముత్యం, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు సూచనలు ఇస్తున్న కొండయ్య

7న కరువు బృందం పర్యటన : జెడి

ప్రజాశక్తి-చిన్నమండెం : చిన్నమండెం మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటిం చిందని, ఈ నెల 7న కరువు బృందం పర్యటించే అవకాశముందని జిల్లా వ్యవసా యశాఖఅధికారి బి.చంద్రనాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వండాడి, పడమటికోన గ్రామాలను ఆయన పర్యటించారు. కరువు పరిస్థితులపై రైతు లతో చర్చించారు. మండలంలో బృందం వచ్చే అవకాశముందని, రైతులు మండలంలో కరువు పరిస్థితులపై స్పష్టంగా వివరించాలని సూచించారు. ఎండిన పొలా ల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి ఇన్‌ఛార్జి ఎడిఎ ఉమాపతి, ఎఒ గీత, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీలకు శ్రీవేద విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లి : గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో గత నెల 23, 24వ తేదీన జరిగిన అండర్-14 బాలబాలికలు అంతరాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలలో శ్రీవేద పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి బి.ప్రశాంత్ 200 మీటర్లు పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. ప్రతిభ కనబరిచినందుకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రశాంత్ ఈ నెల16 నుంచి 20వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ అండర్-14 పాల్గొననున్నారన్నారు. ఎంపికైన ప్రశాంత్‌ను చైర్మన్ రామమోహన్‌రెడ్డి, కరస్పాండెంట్, ప్రిన్సిపల్, పిఇటిలు అభినందించినారు.

విద్యార్థి ప్రశాంత్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

గాడితప్పిన మదనపల్లె పురపాలన : టిడిపి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జె వెంకటేష్

ప్రజాశక్తి-మదనపల్లె

మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు మధ్య ఉన్న విభేదాలు, గొడవలతో పాలన గాడి తప్పిందని, పట్టణ అభివృద్ధి కుంటుపడినట్లు టిడిపి రాజంపేట పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేష్ ఆరోపించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజాల మధ్య కొద్దిరోజులుగా విభేదాలు ఉండడంతో పాలన గాడి తప్పిందన్నారు. చైర్‌పర్సన్ ఆదేశాలను కౌన్సిలర్లు బేఖాతర్ చేయడంతో వివాదం ముదిరిందన్నారు. ఎమ్మెల్యే అండదండలతో కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై ఎదురుదాడి చేస్తున్నారన్నారు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయి అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజా ప్రతినిధుల విభేదాలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. నిధుల కేటాయింపు, అభివృద్ధి విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాలకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 27 పథకాలను రద్దు చేశారని విమర్శించారు. సబ్‌ప్లాన్ నిధులను వేరే పథకాలకు ఉపయోగిస్తుండడంతో దళిత వార్డులు, కాలనీల్లో అభివృద్ధి కుంటుపడిందని మండిపడ్డారు. లారీ పార్కింగ్ కోసం ప్రభుత్వ భూములను కేటాయించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ భూములను సొంత భూములుగా వాడుకోవడం వైసిపి శ్రేణులకు అలవాటుగా మారిందన్నారు. టిడిపితోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామంటూ పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు రాటకొండ మధుబాబు, నవీన్ చౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

నీటి సమస్యపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి-కలకడ

వచ్చే వేసవిలో మండలంలో నీటి సమస్య తలెత్తకుండా పరిష్కరించాలని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు ఎంపిపి శ్రీదేవి రవికుమార్ తెలిపారు. శనివారం ఎంపీ మిథున్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కలకడ మండలానికి సంబంధించి వైఎస్ఆర్ జలకళ కింద బోర్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. జలకళ ద్వారా బోర్లను మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీనిచ్చారని పేర్కొన్నారు. రాయచోటిలో నిర్వహించిన మెజాబ్ మేళాలో ఎంపీ, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జడ్‌పి చైర్మన్ అకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంఘం అధ్యక్షులు చిదంబరెడ్డి, సంబేపల్లి మండల వైస్‌ఎంపిపి రవీందర్‌నాయుడు, వైసిపి నాయకులు రవికుమార్, ఉదయభాస్కర పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపిపి శ్రీదేవిరవికుమార్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ తెలిపారు. మండ లంలోని బాటవారిపల్లి సచివాలయంలో వైనీడ్స్ ఎపిజగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎంపిపి మాట్లాడుతూ కుల,మత, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి , సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్ మోహన్‌రాజానాయుడు, కో-ఆప్షన్ మెంబర్ ఇనాయ తుల్లా, సెక్రటరీ షబానాభాను, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన 'యల్లటూరు'

ప్రజాశక్తి-నందలూరు

శ్రీనివాసరాజును అభినందిస్తున్న పవన్

మండలంలోని నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ కుమ్మ రపల్లెకు చెందిన డిఆర్‌డిఎ మాజీ అధికారి యల్లటూరు శ్రీనివాసరాజు శనివారం మంగళగిరిలో జనాసేన పార్టీ కార్యాలయంలో పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా కండువా కప్పుకొని జనసేన పార్టీలో చేరారు. డిఆర్‌డిఎ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇటీవల స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి రాజకీయ రంగప్రవేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాజకీయ కుటుంబం నుంచి వచ్చానని తన తండ్రి వెంకటరాజు సర్పంచ్‌గా, తమ్ముడు శివరామరాజు మండల ఉపాధ్యక్షుడు, జడ్‌పిటిసి సభ్యులుగా ప్రజలకు సేవలు అందించారని అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితుడినై జనసేన పార్టీలో చేరారని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టత, గెలుపుకోసం కార్యకర్తలా పనిచేస్తానని చెప్పారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

బాధితులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రంగంపల్లె పంచాయతీ రంగంపల్లి దళితవాడ గ్రామ ప్రజల భూములు ఆక్రమణకు గురై ఉన్నాయని, ఆక్రమణకు గురైన భూములను గుర్తించి బాధితులకు అందించాలని బిఎస్‌పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రైల్వే కోడూరు బిఎస్‌పి ఇన్‌ఛార్జి తాళ్లపాక సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం తహశీల్దార్ నరసింహకుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించామని, తహశీల్దార్ స్పందించి ఆక్రమణకు గురైన భూములను సర్వే చేసి బాధితులకు న్యాయం చేస్తానని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో మస్తానయ్య, హేమంత్ కుమార్, బిఎస్‌పి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు పట్టణంలో నిరాశ్రయులు, పాదచారులు, ప్రయాణికుల ఆకలి తీర్చేందుకు సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకృష్ణాలయ యాదవ సేవ కమిటీ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం, పౌర్ణమి రోజున అన్నదానం చేయడం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ దగ్గర ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా ప్రతి శనివారం, పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో తనకెంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్ర మంలో చల్లా మహేష్ యాదవ్, చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస యాదవ్, బిసి నేత రామచంద్రరాజు, శ్రీనివాసులు, సీతంపల్లి రమణ, జయచంద్ర, నల్లం రవిశంకర్, యేసు నాథరెడ్డి, శివ, బోడెం ప్రసాద్, ఈశ్వర్ ఒడ్డి పాల్గొన్నారు.

మహారాజ శ్రీ రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

SOP No 6/2023

1. షేక్ ముబీనా భర్త లేట్ షేక్ షబ్బీర్, వయస్సు 41 సం
2. షేక్ బీ జాన్ భర్త లేట్ ఖాదర్ వల్లి, వయస్సు 68 సం
3. షేక్ మహమ్మద్ ఫైజాల్ తండ్రి లేట్ షేక్ షబ్బీర్ , వయస్సు 8 సం
4. షేక్ మహమ్మద్ ఫయాజ్ తండ్రి లేట్ షేక్ షబ్బీర్ వయస్సు 7 సం

3,4 మైనర్లు రెప్రేజెంట్డ్ టె డ్ బై వారి తల్లి పిటిషనర్ నెంబ్ 1, వీరందరిది డోర్ నెంబర్ 5/351, కొలిమి వీధి, రాజంపేట టౌన్ & మండలం.

...పిటిషనర్లు

వర్సెస్

నిల్. ...రెస్పాండెంట్లు

పిటిషనర్లు 1 నుండి 4, పిటిషనర్ నెంబర్ 1 భర్త షేక్ షబ్బీర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజంపేట మెయిన్ శాఖలో వేసిన ఫిక్స్ డ్ మొత్తం రూ 20, 27, 905/- వారికి చెండవలనని కొరుచూ పిటిషనర్ల పేర సక్సషన్ సర్టిఫికేట్ మంజూరు చేయవలసినదిగా పై పిటీషన్ దాఖలు చేసి యుంటున్నారు. ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 14.12.2023 తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయంగా గానీ , వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోనంతట పరోక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

ఏ.వి సుబ్రమణ్యం

అడ్వకేట్, నందలూరు

ఓటర్ల సవరణకు మంచి అవకాశం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ప్రజలు శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ నరసింహకుమార్ పేర్కొన్నారు. ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా శనివారం అప్పయ్యరాజుపేట గ్రామంలోని బూత్ నెంబర్ 196 ను పరిశీలించి పలు రాజకీయ పార్టీ నాయకులకు, బిఎల్‌ఒలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఓటర్ల సవరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మండలంలోని ప్రతి పోలింగ్ బూత్ దగ్గర ఈ శిబిరాలను ఏర్పాటు చేశామని ఈ మంచి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఒ మల్లికార్జున, బిఎల్‌ఒలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** రాష్ట్ర ప్రభుత్వం ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టే ఉద్దేశంతో స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేసింది. శనివారం మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో పోలింగ్‌స్టేషన్ పరిధిలోని ఓటరు జాబితాను విఆర్‌ఒ నరేంద్ర పరిశీలించారు. ఓటర్ల నుంచి అభ్యంతరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విఆర్‌ఒ నరేంద్ర మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే ఓటర్లు బిఎల్‌ఒలను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. చిరునామా, ఇంటి పేరు మార్చు కునే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. **నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అరవపల్లి 97 పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ సత్యానందం పరిశీలించారు. బిఎల్‌ఒలకు సూచనలు అందించారు. మండలంలోని ప్రతి పంచాయతీలో పోలింగ్ కేంద్రాలో ఏర్పాటు చేసిన శిబిరాలను ఓటర్లు తప్పనిసరిగా ఉపయోగించువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్య నారా యణ, డిటి మోహన్, ఆర్ఐ సుశీల్‌కుమార్, సర్వేయర్ ఓబయ్య, విఆర్‌ఒ రాజు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు. **వీరబల్లి :** ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఓటర్ల జాబితా సవరణలకు అవకాశం కల్పి స్తున్నట్లు తహశీల్దారు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పోలింగ్ బూతుల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. మండలంలో 18ఏళ్లు నిండిన యువత ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామచంద్ర రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పెంచలయ్య, సర్పంచ్ గోపీనాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. **ములకలచెరువు:** మండలంలోని 18 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండ లంలోని బురకాయలకోట, వేపూరికోట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి బిఎల్‌ఒలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 38పోలింగ్ కేంద్రాలు ఉండగా 36,293మంది ఓటర్లు ఉన్నారన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలలో ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పుల్లంపేట : బిఎల్‌ఒలతో మాట్లాడుతున్న తహశీల్దార్ నరసింహకుమార్

వీరబల్లి : ఓటు నమోదు పోస్టర్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

దళితుల భూ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

తమ భూమిని ఆక్రమించిన ఆక్రమణ దారుల నుంచి విడిపించిన తహశీల్దార్‌కు రుణపడి ఉంటామని దళితులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎర్రగుడి గంగులమ్మ, ఎర్రగుడి లీలావతి, ఎర్రగుడి అంజనమ్మ , ఎర్రగుడి గంగయ్యలు మాట్లాడుతూ 1972 సంవత్సరంలో లక్కిరెడ్డిపల్లి బ్రాహ్మణ ఎర్రగుడి రెవెన్యూ గ్రామ పొలం సర్వేనెంబర్ 318/1,2, సర్వే నెంబర్లు ఎనిమిది ఎకరాల పొలం అసైన్మెంట్ పట్టాలు అప్పటి ప్రభుత్వం తమకు మంజూరు చేసిందన్నారు. ఈ పొలాన్ని స్థానికంగా ఉండే దిన్నెపాడు వడ్డేపల్లికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి భూమి సర్వే చేయకుండా గత పది సంవత్సరాలుగా అడ్డుకుం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని తహశీల్దార్ ఉదయ్ శంకర్‌రాజు దృష్టికి తీసుకపోవడంతో చొరవ తీసుకొని భూమిని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేశారన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో మండల సర్వేలు కరీముల్లా పాల్గొన్నారు.

దళితుల భూ సమస్యను సర్వే చేయిస్తున్న తహశీల్దార్

యువత ఓట్లు దండుకునేందుకే జాబ్‌మేళా

మాట్లాడుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వైసిపి నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేలు యువత ఓట్లు దండుకునేందుకు ఎన్నికల ముందు జాబ్‌మేళాలు పెట్టి యువతను మోసం చేస్తున్నారని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు తోపురెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం లక్కి రెడ్డిపల్లి విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇంతవరకు క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 డిఎస్‌సి, ఎస్ఐ కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. జాబ్‌మేళా పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసేందుకు ఈ పన్నాగాలు పండుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే, ఎంపీ ఫేక్ జాబ్‌మేళా పేరుతో రాయచోటిలో నిరుద్యోగ యువకులను మోసం చేస్తున్నారని విమర్శించారు.

నూతన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

-బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబర్ నెల 31న తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27 ఆఫ్ 2023 భూ హక్కు చట్టం రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు డిమాండ్ చేశారు. ఈ చట్టంపై బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ ఇది ప్రజల భూహక్కులకు విఘాతం కలిగించే చట్టమని, ఇందులో పేద వారికి న్యాయం జరగదని అన్నారు. ఒకవేళ పేదవారు తమ భూ హక్కులను పొందాలంటే సివిల్ కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందే వారని, ఇప్పుడు ఈ చట్టం వల్ల సామాన్య ప్రజలు సివిల్ కోర్టు ద్వారా న్యాయం పొందే వీలు కలగదని, చాలామంది రైతులకు కూడా నష్టం ఏర్పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఈ చట్టాన్ని పునః పరిశీలించి సివిల్ కోర్టు ద్వారానే సామాన్య పౌరుడికి న్యాయం పొందేటట్లు చట్ట సవరణ చేయాలని తమ అభిప్రాయాల్ని వెల్లడించారు. మాజీ ఎజిపి న్యాయవాది షేక్ మొహమ్మద్ అలీ మాట్లాడుతూ ఇప్పటి నుంచి ప్రజల భూ స్థిరాస్తులపైన రాష్ట్రప్రభుత్వంచే నియమించబడిన ల్యాండ్ టైటిలింగ్ రెవెన్యూ ఆఫీసర్ ద్వారా భూ హక్కు రిజిస్ట్రేషన్లలో ఒకసారి భూహక్కు దారుడు పేరు నమోదైన తర్వాత ఈ భూములలో ఎవరు సివిల్ కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదని అన్నారు. ఏమైనా ఇరు వర్గాల మధ్య అభ్యంతరాలు ఉంటే జాయింట్ కలెక్టర్ స్థాయిలో రెవెన్యూ ట్రిభునల్ లోనే తేల్చుకోవాల్సి వస్తుందని, సివిల్ కోర్టులో కేసులు దాఖలు చేయబడటకు వీలుపడదని అన్నారు. ఈ చట్టం ద్వారా భారత పౌరుని రైట్ టు ప్రాపర్టీ హక్కుకే విఘా తం కలిగే అవకాశముందన్నారు. ఈ చట్టంలోని లోపాలను సవరించి సివిల్ కోర్టులకు అధికారాలు ఇవ్వాలని లేదా, లోప భూయిష్టమైన ఈ చట్టాన్ని నిషేధించాలని కోరారు. ప్రజలు ఈ చట్టం పైన అవగాహన పెంపొందించుకోవడం చాలా అవసరమని ఇందులోని లాభనష్టాలను తెలుసుకోవాలని ప్రజలను కోరారు. మావేశంలో ఎజిపి షమీవుల్లాఖాన్, న్యాయవాదులు గొబ్బిళ్ళ సుబ్బరామయ్య, హెచ్.ఆనంద్‌కుమార్ ముంగిమోహన్, అలీ, మహిలన్యాయవాది మీనా, నూరుఅహ్మద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దాసరి నరసింహులు

ఐస్‌క్రీమ్ పార్లర్‌లో అగ్ని ప్రమాదం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-పీలేరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పీలేరులో ఓ ఐస్ క్రీమ్ పార్లర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి మస్తాన్ ఇచ్చిన సమాచారం మేరకు శనివారం పీలేరు పట్టణం, చిత్తూరు రోడ్డులోని హట్సన్ మిల్క్ డైరీ పార్లర్ లో షార్ట్ సర్క్యూట్ సంభవించిందన్నారు. ఫలితంగా దట్టమైన పొగ, మంటలు వ్యాపించాయన్నారు. తమ అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందిన వెంటనే తాను తన సిబ్బందితో సహా ఘటనా స్థలానికి చేరుకున్నామని చెప్పారు. ఐస్ క్రీమ్ పార్లర్‌లో పొగ, మంటలను అదుపు చేశామన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అగ్ని మాపక కేంద్రాధికారి ఎస్.మస్తాన్, ఎల్ఎఫ్ఎన్, హేమాద్రిరెడ్డి, డిఒపి కె.శ్రీనివాసులు, ఎఫ్ఎం ఎం.వెంకటేష్, హెచ్.జి. షకీల్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రధానం : పిసిసి

వేంపల్లె : ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాధానమని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటరు జాబితాను శనివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ముసాయిదా ఓటరు జాబితాలో తన ఓటు ఉందో లేదో అని ఓటర్ జాబితాలో తన పేరును తనిఖీ చేయాలని బిఎల్‌ఒ గంగిరెడ్డిని కోరారు. అనంతరం బాలుర పాఠశాలలో చేపట్టిన మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. వసతులు, తాగునీటిపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, నామా వినయ్, సంజీవ్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' ఎవరి కోసం? : డివైఎఫ్ఐ

జమ్మలమడుగు రూరల్ : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని డివైఎఫ్ఐగా స్వాగతిస్తున్నామని, అయితే క్రీడా మైదానాలు, కోచ్‌లు, పీఈటి పోస్టులు భర్తీ చేయకుండా, సమగ్ర సచారం ఇవ్వకుండా కేవలం ప్రచారం కోసం మాత్రమే అన్నట్లు ఉందని యూనియన్ పట్టణ అధ్యక్షులు తుడుం ఎల్లయ్య తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు క్రీడాకారుల గురించి గొప్పలు చెప్పిన జగన్ అధికారంలోకి రాగానే ఇప్పటికీ 80శాతం మంది క్రీడాకా రులకు వైఎస్ఆర్ ప్రోత్సాహక బహుమతులను అందించలేదని ఆరోపిం చారు. క్రీడలకు ప్రతి బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని, పే అండ్ ప్లే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనే యువకులతో కలిసి ఉద్యమించవలసి వస్తుందని హెచ్చరించారు.

రామాపురం : ఉజ్వల గ్యాస్ కనెక్షన్ పత్రాలను అందిస్తున్న సుబ్బారెడ్డి

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పేదలకు వరం

ప్రజాశక్తి-రామాపురం

ఉజ్వల యోజన పథకం ఉచితగ్యాస్ కనెక్షన్లు పేదలకు వరం లాంటిదని ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సివి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్పనాయుని చెరువు గ్రామ సచివాలయాల్లో శనివారం ఎంపిడిఒ హైదర్‌వల్లి ఆధ్వర్యంలో విక్షిత్ భారత సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ కార్డులను డాక్టర్ వినోద్‌కుమార్, ప్రభాకర్ ఇండియన్ డిస్ట్రిబ్యూటర్ సివి.సుబ్బారెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద ఇన్సూరెన్స్ పథకం పిఎంజెఎవై అని ఈ ఇన్సూరెన్స్ వల్ల ప్రతీ కుటుంబానికి ఐదు లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 18 రకాల పథకాల గురించి ఆయన ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబిరము నిర్వహించి రోగులకు చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. టి.బి.ముక్త్ భారత్‌లో క్షయ రోగులకు పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా పంపిణీ చేశారు. చికిత్స కాలంలో మంచి పౌష్టికాహారం నిమిత్తం రోగికి రూ.500 వారి ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. దాతల సహకారముతో టిబి రోగులను దత్తత తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు వైష్ణవి మండల ఉపాధ్యక్షురాలు నాగరాణి బాబు, వెంకటంరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి. కృష్ణయ్య వైద్యాధికారి వినోద్‌కుమార్ , ఇఒపిఆర్‌డి ఉషారాణి అన్ని శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** మండలంలోని శీలంవారిపల్లి గ్రామపంచాయతీలలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఉజ్వలపథకం క్రింద గ్యాస్‌స్టవ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహన కలిగి ఉండాలి

తంబళ్లపల్లి : రానున్న ఎన్నికల నిర్వహణలో ఇవిఎం మిషన్లపై అధికారులు పూర్తి అవగాహన పొంది ఓటర్లకు అవగాహన కల్పించాలని ఎన్నికల నిర్వహణ అధికారి రాఘవేంద్ర కోరారు. శనివారం తంబళ్లపల్లె ఎంపిడిఒ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ఎలక్ట్రోల్ ఆఫీసర్లకు ఈవిఎం మిషన్లపై ఏర్పాటు నిర్వహణ అంశాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ రాఘవరెడ్డి ఇవిఎం మిషన్లో కంట్రోల్ యూనిట్ బ్యాలెట్ యూనిట్ల ఈవి ప్యాట్లను ఏర్పాటు చేసే తీరుపై ప్రయోగాత్మకంగా వివరించారు. పలువురి అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఇదే తరహాలో నాలుగవ తేదీ నుంచి ప్రతి సెక్టోరియల్ ఆఫీసర్ పరిధిలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఓటు వేసే తీరుపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈసారి ఎన్నికలలో అధిక శాతం ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే విధంగా ముందస్తు అవగాహన కార్యక్రమాలు సూచించారు. కార్యక్రమంలో తంళ్లపల్లె తహశీల్దార్ శ్రీనివాసులు, ఫ్యాక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

ఇవిఎంల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న రాఘవేంద్ర

క్రైం కార్నర్

స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న పోలీసులు

పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాజంపేట డిఎస్‌పి ఆదేశాల మేరకు కోడూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, చిట్వేలి ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ సిబ్బంది మండలంలోని ఎస్.ఉప్పరపల్లె, ఉప్పరపల్లి దళితవాడ గ్రామాల్లో నాకాబంది నిర్వహించినట్లు తెలిపారు. ఆ గ్రామాలలో రికార్డులు లేని పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కారు, ట్రాక్టర్, ఆటో ఢీ : మహిళ దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారిపై వాల్మీకిపురం రోడ్డు సిటిఎం కంకర ఫ్యాక్టరీ దగ్గర శనివారం కారు, ట్రాక్టర్, ఆటోను ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందగా ఆటో డ్రైవర్‌తో సహా నలుగురికి తీవ్రగాయాలైనట్లు తాలుకా ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ చింతపర్తి మహేష్‌బాబు సహా నలుగురికి తీవ్రగాయాలు కాగా లక్ష్మీదేవి(52) మృతి చెందిందని అన్నారు. గాయపడ్డ బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.వీరిలో లక్ష్మీనారాయణ, అతని భార్య శ్వేత పరిస్థితి విషమంగా ఉందన్నారు. కారులో ప్రయాణిస్తున్న బాగేపల్లికి చెందిన వెంకటేష్, ఆటో డ్రైవర్ మహేష్‌బాబులు మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాని చెప్పారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

9 మంది పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

పేకాట ఆడుతున్న తొమ్మిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని స్థానిక ఇందిరమ్మకాలనీ సమీపంలోని ఈద్గా మైదానంలో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ .34,940 నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ దాడులలో ఎఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, పోలీసులు మహ బూబ్‌బాషా, యోగేష్ ,మునిరాజా, రాజేంద్రనాయక్, ప్రతాప్, డ్రైవర్ రమేష్ పాల్గొన్నట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టును చూపుతున్న పోలీసులు